క్లుప్తంగా

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మందలపు శ్రీనివాసరావుకు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. 'యాన్ ఇంటెలిజెంట్ ఫ్రేమ్ వర్క్ ఫర్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ ఇన్ ఈ కామర్స్ అండ్ సోషల్ మీడియా ఆటోమేటిక్ సజిషన్ సిస్టమ్' అనే అంశంపై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ బి.నారాయణన్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాలలో డాక్టరేట్ పొందిన స్టాఫ్ మొత్తం 145 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల కార్యదర్శి డాక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ నగేష్ తదితరులు అభినందించారు.

'కళ్లం' అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: నైపుణ్యతలతో కూడిన విద్యావిధానాలతో ప్రతి విద్యార్థి, అధ్యాపకుడి లక్ష్యసాధనకు తమ కళాశాల కృషిచేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ వలేటి నాగార్జునకు హిందూస్థాన్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసిందన్నారు. 'క్లవుడ్ కంప్యూటింగ్ విత్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ' అనే అంశంపై యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.శిరోరమణి షర్మిళ పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ వి.రాజీవ్‌జట్సన్ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు



పొన్నూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పొన్నూరు ఇన్‌చార్జ్ జక్కా రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని కసుకర్రు గ్రామంలో అమృత కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్యంపైఅవగాహన కల్పించటంతో పాటు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించేందుకు వైద్యశిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులకు నేత్ర పరీక్షలు చేసి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యశాల సిబ్బంది జి.రాజు, ఎస్.రాజు, రాణి, గోపి తదితరులు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు



ప్రత్తిపాడు: రక్తహీనతను అధిగమించేందుకు విద్యార్థులు పోషకాహారాన్ని తీసుకోవాలని పీహెచ్ఎన్ నిర్మలాదేవి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం డైట్ కళాశాలలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 150 మందికి పైగా విద్యార్థులకు పీహెచ్ఎన్ నేతృత్వంలో హెచ్‌బీ పరీక్షలు చేసి అక్కడికక్కడే ఫలితాలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా నిర్మలాదేవి మాట్లాడుతూ విద్యార్థులు తమ రక్త గ్రూపుతో పాటు హిమోగ్లోబిన్ శాతాన్ని కూడా తరచూ పరీక్షించుకోవాలన్నారు. తగినంత హెచ్‌బీ శాతం లేనివారిని రక్తహీనతగా పరిగణించడం జరుగుతుందన్నారు. హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకునేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌వీ విజయకుమారి, ఏఎన్ఎంలు శ్రీలత, నాగమణి, హెల్త్ అసిస్టెంట్ స్పందన, ఆశాకార్యకర్తలు శ్రీలక్ష్మి, జ్యోతి సాధన తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సంగ్రామంలో కీలక భూమిక

- సమరయోధులకు పుట్టినిల్లు చేబ్రోలు
- జాతిపితకు ఘనస్వాగతం పలికిన గ్రామం
- స్వాతంత్య్ర పోరాటంలో చురుగ్గా పాల్గొన్న చేబ్రోలు మహిళలు



చేబ్రోలులో మహాత్ముడు బసచేసిన ఆశ్రమం నేడు శిథిలావస్థకు చేరిన దృశ్యం



స్వాతంత్య్ర సమరయోధురాలు సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ

చేబ్రోలు: స్వాతంత్య్ర పోరాటంలో చేబ్రోలు కేంద్రంగా అనేకమంది మహిళలు, యువకులు పాల్గొని తమ దేశభక్తిని చాటారు. గుంటూరు జిల్లాలోని చేబ్రోలు ప్రాంతం నుంచి స్వాతంత్య్ర సంగ్రామంలో అధిక సంఖ్యలో 48 మంది పాల్గొనగా వారిలో 25 మందివరకు మహిళలు ఉండటం విశేషం. ప్రజలలో దేశభక్తిని పెంపొందించటం కోసం ఇక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాకు మొట్టమొదటిసారిగా వచ్చిన మహాత్మాగాంధీ గుంటూరు నుంచి బాపట్ల వెళుతూ మార్గమధ్యలో చేబ్రోలులో బస చేసినట్లు చెబుతారు. నాటి గాంధీ ఆశ్రమంగా పిలువబడిన స్థావరం ప్రస్తుతం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. చేబ్రోలు ప్రాంతం నుంచి స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రముఖంగా సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ, వాసిరెడ్డి చంద్రశేఖరం, పొడిబండ్ల నాగేశ్వరరావు, పార్వతమ్మ, గోళ్లమూడి రత్తమ్మ, అన్నపూర్ణమ్మ, బసవలింగయ్య, సైసైరా చిన్నప్పరెడ్డి, అఖిలాండేశ్వరి తదితరులు ఉన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో పా ల్గొన్న స్వాతంత్య్ర సమరయోధుల పేర్లతో కూడిన శిలాఫలకం వారిని గుర్తుచేస్తూ ఏర్పాటు చేశారు.

● పోరాటంలో మహిళామణులు..

బ్రిటీష్ వారి బానిస సంకెళ్లను తెంచి భరతమాత దాస్య విముక్తి కోసం జరిగిన స్వతంత్ర పోరాటంలో, చారిత్రక ఉద్యమంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా అద్భుతమైన సాహసాలను ప్రదర్శించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. మహిళలు బయటికి రావడమే అరుదైన నాటి కాలంలో భరతమాత దాస్య సంకెళ్లను తెంచేందుకు స్వాతంత్య్ర పోరాటం చేస్తూ ఆ ఉద్యమానికి మహిళలు ఊపిరిగా నిలిచారు. దేశమాత కోసం స్వతంత్ర సమరంలో పాల్గొని జైలుకు వెళ్లిన చేబ్రోలు మహిళల్లో ప్రముఖంగా రాజ్యలక్ష్మమ్మ, అఖిలాండేశ్వరి, అన్నపూర్ణమ్మ, రత్తమ్మ తదితరులు ఉన్నారు.

● పోరాట యోధురాలు రాజ్యలక్ష్మమ్మ..

ప్రముఖ స్వాంతంత్య్ర సమరయోధురాలు, సంఘ సేవకురాలు, అండమాన్ వెళ్లి నేతాజీ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మహిళ సూర్యదేవర రాజ్యలక్ష్మిదేవి. రాజ్యలక్ష్మమ్మగా పిలవడబడే ఈమె మహిళా ఉద్యమాలలో, ఖద్దరు ప్రచారంలో, మద్యపాన వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొని ఎందరికో స్ఫూర్తినిచ్చింది. కృష్ణాజిల్లా నందిగామ తాలుకా వీరులపాడులో మే18వ తేదీ 1914న రాజ్యలక్ష్మిదేవి వాసిరెడ్డి సీతారామయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించింది. చేబ్రోలుకు చెందిన సూర్యదేవర నాగయ్యతో పదేళ్ల వయస్సులో వివాహం జరిగింది. మహాత్మాగాంధీజీ పిలుపుతో 1932లో శాసనోల్లంఘనం నాటికి అత్తగారింటికి చేబ్రోలు వచ్చారు. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనటంతో ఆమెను అరెస్ట్ చేశారు. రాజ్యలక్ష్మిదేవిని రాయవేలూరు జైలుకు తరలించారు. రాజ్యలక్ష్మికి ఖాదీ ప్రచారం, మహిళా ఉద్యమం, రాజకీయ కార్యకలాపాలు పరిపాటి అయ్యాయి. 1940లో ఉప్పు సత్యాగ్రహం ఆరంభమైంది. ఆమె బ్రాహ్మణకోడూరులో సత్యాగ్రహం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి రెండు నెలల జైలు శిక్ష, జరిమానా విధించారు. 1941లో చేబ్రోలులో జాతీయ మహిళా విద్యాలయాన్ని స్థాపించారు. ఆ తరువాత అక్టోబర్ 2వ తేదీన 1945లో ఆంధ్రరాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. స్వాతంత్య్రం అనంతరం తరువాత నైజాం వ్యతిరేక పోరాట నాయకులకు తమ సంఘీబావాన్ని తెలిపారు. నైజాం వెళ్లి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యలక్ష్మిదేవి 2010 ఆగస్టు 8వ తేదీన మరణించారు.

చెరువు కట్టలు పటిష్టం చేస్తాం

తహసీల్దార్ కె.రవిబాబు



ప్రత్తిపాడు: గండి పడిన ప్రాంతంలో చెరువు కట్టను పటిష్టంగా పునర్నిర్మించాలని ప్రత్తిపాడు తహసీల్దార్ కె.రవిబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని యనమదల చిన్న చెరువుకు ఎలుకలు పెట్టిన కన్నాలు పెద్దవిగా మారి, చెరువుకు గండి పడటం, నీరు పొలాల్లోకి పెద్దఎత్తున వెళ్లడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇసుక బస్తాలతో గండికి అడ్డుకట్ట వేసే పనులు జరుగుతున్నాయి. గండి పూడ్చే పనులను బుధవారం తహసీల్దార్ రవిబాబు పరిశీలించారు. మైనర్ ఇరిగేషన్ అధికారులతో పాటు రెవెన్యూ, పంచాయతీ అధికారులు, స్థానికులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లోకి చెరువు నీరు వెళ్లిందని, పంటలకు ఏమైనా నష్టం చేకూరిందా? వంటి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెరువు కట్టలను అత్యంత పటిష్టతతో ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పంచాయతీ అధికారులు, గ్రామస్తులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

మదినిండా మువ్వన్నెల జెండా

- 300 అడుగుల భారీ త్రివర్ణ పతాకంతో నారాకోడూరులో ర్యాలీ
- అలరించిన విద్యార్థుల వేషధారణలు



నడింపాలెంలో 120 అడుగుల త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



నారాకోడూరులో 300 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

ప్రత్తిపాడు: మండల పరిధిలోని నడింపాలెంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 130 అడుగుల భారీ త్రివర్ణ పతాకంతో విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ర్యాలీ చేపట్టారు. గ్రామంలోని అంతర్గత వీధుల్లో జై భారత్..జై భారత్ అంటూ నినాదాలు చేశారు. స్థానిక విజేత పాఠశాల విద్యార్థులు భారత మాత, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ.. వంటి స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఇన్‌చార్జి సర్పంచ్ పాలెపుకుమారి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఖాజా, విజేత స్కూల్ ప్రిన్సిపాల్ కె.సురేష్, డైరెక్టర్ కల్యాణి, సెక్రటరీ రోజా ప్రకాష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

300 అడుగుల జెండాతో ప్రదర్శన...

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అఖిలభారత విద్యార్థి పరిషత్ సమన్వయంతో హర్ ఘర్ తిరంగా జెండా ర్యాలీని బుధవారం ఘనంగా జరిగింది. మండల విద్యాశాఖ అధికారి ఏహెచ్‌వీ ప్రసాద్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వీధులలో వందేమాతరం, భారత్ మాతాకీ జై, అమరవీరులకు జోహార్లు, హర్ ఘర్ తిరంగా అంటు నినాదాలు చేస్తూ దేశభక్తిని ప్రేరేపించే విధంగా ర్యాలీ నిర్వహించారు. నారాకోడూరు వీధుల్లో మానవహారం ఏర్పాటు చేసి 300 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయులు బత్తుల వెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుంటూరు రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు తెలిపారు. బుధవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణం సమతుల్యంగా ఉంటేనే ప్రతి జీవి మనుగడ సాగించగలదన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించవలసిన అవసరం మన చేతుల్లోనే ఉందని 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రైతునేస్తం ఫౌండేషన్‌లో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో 6–10 తరగతు విద్యార్థులు 250 మంది పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ఇద్దరు మొదటి బహుమతి సాధించిన చిన్నారులకు రూ 2,000 చొప్పున, రెండవ బహుమతి సాధించిన ముగ్గురికి రూ 1,500 చొప్పున, మూడవ బహుమతి సాధించిన ఏడుగురికి రూ 1,000, కన్సోలేషన్ బహుమతి సాధించిన 15 మందికి రూ.500 చొప్పున నగదు బహుమతితో పాటు విజేతలకు సర్టిఫికెట్లు, మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో ఏవీఏఎస్ ప్రసాద్, జయశ్రీ, వాగోలు వేంకటేశ్వరరావు, షేక్ బాజిద్‌ఖాన్, రామాంజనేయులు, మల్లికార్జునరావు, నేరేళ్ల తిరుపతిరావు (చిన్నస్వాములు) రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సహాయనిధి సేకరణ



లక్ష్మీపురం: కేరళలోని వయనాడ్‌లో ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా కొండ చర్యలు విరిగి పడి సుమారు 400 మంది మృతి చెంది, ఊర్లకు ఊర్లు కొట్టుకుపోవడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం వరద బాధితుల సహాయ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ బాధితుల్ని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు, ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సుస్థిర ప్రణాళికలు



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న బాపట్ల విస్తరణ కేంద్రం ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరెడ్డి



శిక్షణలో పాల్గొన్న సర్పంచులు, కార్యదర్శులతో ఎంపీపీ పద్మలీల

బాపట్ల విస్తరణ కేంద్రం ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరెడ్డి

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేయడంలో ఆయా గ్రామ పంచాయతీలు సిద్ధం చేసే అభివృద్ధి ప్రణాళికలు అత్యంత కీలకమని బాపట్ల విస్తరణ కేంద్రం ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్పంచ్‌లు, సెక్రటరీల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రిన్సిపాల్ ఆకస్మికంగా సందర్శించారు. శిక్షణకు ప్రతి రోజూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారా లేదా అన్న విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో సర్పంచ్‌లు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ అభివృద్ధికి మనం రూపొందించే ప్రణాళికలు సక్రమంగా ఉంటేనే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. చిన్న పంచాయతీనా, పెద్ద పంచాయతీనా అనేది ఉండదని, సర్పంచ్‌లు ఎలా తమ గ్రామాభివృద్ధికి అడుగులు వేస్తున్నారన్న దానిపై ఆధారపడి అవార్డులు వస్తాయని చెప్పారు. సర్పంచ్‌ల విధులు బాధ్యతలను మరోసారి పునశ్చరణ చేసేందుకే ప్రభుత్వం మూడు రోజుల పాటు శిక్షణను ఇచ్చిందని చెప్పారు. జీపీడీపీ ప్లాన్‌లో క్లాప్‌మిత్రల వేతనాలు, కరెంట్ ఛార్జీల వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు.

● ఆఖరి రోజు శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్‌లు, సెక్రటరీలకు వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ, ఎల్ఈడీ దీపాల మెయింటెనెన్స్ ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలు, ఎల్ఈడీ ప్రాజెక్టుల వలన పంచాయతీకి కలిగే లాభాలను రిసోర్స్ పర్సన్‌లు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకోటయ్య, సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి...

పొన్నూరు: గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. పొన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన వివిధ అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచులు బొనిగల నాగమల్లేశ్వరరావు, జాలాది యానాదిరావు, అక్కి నాగరాజు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సామూహిక సీమంతాలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో బుధవారం శ్రీ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో గైనకాలజీ విభాగంలో గర్భిణులకు వైభవంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. శ్రీ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారి జన్మదిన వేడుకలలో భాగంగా సప్తదానాల పేరిట సమితి సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గర్భిణులకు సురక్షితమైన ప్రసవం జరిగి మంచి ఆరోగ్యంతో భూమిపై చిన్నారులు రావాలని కోరారు. కార్యక్రమంలో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కరుణ, డాక్టర్ శివరంజని, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ స్వరూప, డాక్టర్ సునీత, డాక్టర్ ఆదిలక్ష్మి, ఎల్. అరుణ, సమితి సభ్యులు కిలారి అరుణ, బొగ్గవరపు సుజా రాణి, నాగశ్రీ, పోగుల పావని, కుమారి, సుస్మిత పాల్గొన్నారు.

టీడీఎస్ తక్షణమే పూర్తిచేయాలి: ఎస్టీయూ


గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల టీడీఎస్ ప్రక్రియను తక్షణమే పూర్తిచేయాలని ఎస్టీయూ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె. వెంకయ్య, మహంకాళరావు డిమాండ్ చేశారు. కలెక్టర్ బంగళా రోడ్డులోని గుంటూరు అర్బన్, రూరల్ మండలాల ఎంఈవో కార్యాలయంలో బుధవారం ఎంఈవోలు బి.వి. రమణయ్య, నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్‌ను కలిసిన ఎస్టీయూ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల వేతనాల్లో క్వార్టర్-1, 2 టీడీఎస్ పూర్తి కాకపోవడంతో 600 మంది ఉపాధ్యాయులు ఈ-ఫైలింగ్ చేయలేక పెనాల్టీ పరిధిలోకి వచ్చారని తెలిపారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. ప్రసాదరావు, నాయకులు కె.వి జయబాబు, కెనడీ, డేవిడ్‌రాజు, యు.మస్తాన్‌వలి పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్‌లో 'అమ్మపేరుతో మొక్కనాటుదాం'



గుంటూరు రూరల్: మొక్కలు పర్యావరణాన్ని పరిరక్షించటంతోపాటు జీవరాశికి ఎంతో మేలు చేస్తాయని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. బుధవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో 78వ స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా అమ్మ పేరుతో ఒక్క మొక్కనాటుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో వీధుల్లో తిరిగి ప్రజలకు మొక్కలు నాటటం వల్ల కలిగే లాభాలు వివరించారు. గ్రామ ప్రధాన వీధుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల పీడీ బాలశౌరిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ కె సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



కాకుమాను: పెదనందిపాడు తహసీల్దార్‌గా పి.శంకర్ బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు.గతంలో ఆయన ఆంధ్రప్రదేశ్ సెక్రటరియేట్‌లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పెదనందిపాడు తహసీల్దార్‌గా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు, రైతులకు ఎప్పుడు అందుబాటులో అంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

25న చలపతి ఫార్మసీలో ఓపెన్ చెస్ టోర్నమెంట్



చెస్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని చలపతి ఫార్మసీ కళాశాల అధిపతి వైవీ ఆంజనేయులు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఈనెల 25న మోతడకలోని చలపతి ఫార్మసీ కళాశాలలో నిర్వహించనున్న తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడవల్ల విద్యార్థుల్లో ఆలోచనాశక్తిని మెరుగవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఈపోటీలలో గెలుపొందిన విజేతలకు రూ.77,777లు బహుమతిగా అందజేస్తామన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను ముందుగా శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపినాథ్‌ను 9703049378 నంబరులో సంప్రదించి, నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.700 చెల్లించాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



చేబ్రోలు: చేబ్రోలు గ్రామ శివారులోని కొమ్మమూరు చానల్ బ్రిడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. కాకుమాను ప్రాంతానికి చెందిన షేక్ నాగూర్ బాషా ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్లాడు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణమవగా, చేబ్రోలులోని కొమ్మమూరు ఛానల్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన నాగూర్ బాషాను 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.